నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 11 డిసెంబర్ 2024 | VIKARABAD

ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో అవస్థలు

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, డిసెంబర్ 10 : తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగి 15 మంది ఆసుపత్రిపాలైన ఘటన బాధాకరం, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల చూపే కపట ప్రేమకు నిదర్శనమని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఆసుపత్రిపాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. రాష్ట్రంలో వరుసగా ఇలాంటి ఘటనలు ఎన్ని జరిగినా.. ఎంతమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం ఎందుకు అప్రమత్తం అవ్వడంలేదని ప్రశ్నించారు. విద్యార్థులంటే పట్టింపు లేదా ఈ ప్రభుత్వానికి? ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మేలుకొని విద్యార్థుల పట్ల దృష్టి సారించి, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు.

మార్పంటే ఇదేనా..?

- తెలుగు తల్లిని కాంగ్రెస్ సర్కారు అవమానించడంపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన గళం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తెలుగు తల్లి విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు, తెలంగాణవాదుల అభిప్రాయాల మేరకే మాజీ సీఎం కేసీఆర్ తెలుగు తల్లి విగ్రహం ఆవిష్కరణ
- కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం ఎవరి వల్లా కాదు
- ఆడపడుచులను అవమానిస్తున్న కాంగ్రెస్ సర్కారు
- ప్రజలకు నచ్చకున్నా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసి నియంతలా ప్రవర్తిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణ అస్తిత్వానికి ముప్పు తెచ్చారని మండిపాటు

సచివాలయం సాక్షిగా తెలుగు తల్లికి అవమానం

పరిగిలో తెలుగు తల్లి విగ్రహానికి క్షీరాభిషేకంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులు

తెలంగాణ ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసిన సీఎం

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 10 : తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, కవులు, కళాకారులు కలిసి రూపొందించిన తెలుగు తల్లి విగ్రహాన్ని మార్చడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. పరిగిలోని తెలుగు తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడు కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధమై, ఆమరణదీక్ష చేపట్టడంతోనే ఆనాటి కేంద్రం దిగివచ్చి తెలంగాణ ప్రకటించిందన్నారు. ఉద్యమ సమయంలో అందరి ఆలోచన మేరకు తెలుగు తల్లి విగ్రహం రూపొందించడం జరిగిందన్నారు. కేసీఆర్ పాలనలోని ఆనవాళ్లు లేకుండా చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఏకంగా తెలుగు తల్లి విగ్రహ స్వరూపాన్నే మార్పు చేయడం సరైంది కాదన్నారు. ఈ మార్పును తెలంగాణ ప్రజలు ఆమోదించడంలేదన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ అరవింద రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో తెలంగాణ అస్తిత్వానికి ముప్పు

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్/కొత్తూరు, డిసెంబర్ 10 : కాంగ్రెస్ పార్టీ చర్యల వల్ల తెలంగాణ అస్తిత్వానికి ముప్పు ఏర్పడిందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కొత్తూరు వై జంక్షన్ వద్ద, షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మునుపటి తెలుగు తల్లి విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు, కవులు, కళాకారులు, మేధావులు ఏర్పాటు చేసిన తెలుగు తల్లి విగ్రహాన్ని మార్చడం రాష్ట్రంలో వచ్చిన మార్పు అని ఎద్దేవా చేశారు. ఉన్నదాన్ని మార్చడం కోసం ప్రజలు కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టారా లేక అభివృద్ధి కోసం అధికారం ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. సోనియాగాంధీ పుట్టిన రోజున తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడం వల్ల తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ వాళ్లు ఇస్తున్న సందేశం ఏంటని ఆయన అడిగారు.

అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు, తెలంగాణవాదుల అభిప్రాయాల మేరకే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించి ఆవిష్కరిస్తే నేటి సీఎం ఏకపక్షంగా ప్రజలకు నచ్చకున్నా కొత్త తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఎవ్వరైనా మన తల్లి గొప్పగా ఉండాలని కోరుకుంటామే తప్పా తక్కువ చేసుకోబోమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రజలు స్వాగతించడం లేదని, మునుపటి తెలుగు తల్లి విగ్రహాన్ని ఇక్కడి ప్రజలు ఆరాధించి పూజిస్తారని ఆయన చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు జాప్యం వల్ల ఎంతో మంది యువత అసువులు బాశారని చెప్పారు. వారి చావులకు కారణం కాంగ్రెస్ పార్టీ కాదా అని ఆయన ప్రశ్నించారు. చావు నోట్లోకి వెళ్లివచ్చిన కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఎమ్మెల్యే అన్నారు. ఉన్నవాటిని మార్చడం కాదని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే సూచించారు.

ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్. నటరాజన్, సీనియర్ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ విఠల్, కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ నాయకులు

> సచివాలయం సాక్షిగా కాంగ్రెస్ సర్కారు తెలుగు తల్లిని అవమానిస్తూ తల్లి రూపం మార్చడాన్ని నిరసిస్తూ మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు గళమెత్తారు. బీఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో తెలుగు తల్లికి క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ రావాలి.. మార్పు రావాలని ఎన్నికలకు ముందు చెప్పి.. తీరా అధికారంలోకి వచ్చాక తెలంగాణ అస్థిత్వాన్ని పూర్తిగా దెబ్బతీసే కుట్ర కాంగ్రెస్ సర్కారు చేస్తున్నదన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం ఎవరి తరమూ కాదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ద్రోహం చేసి ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు, తెలంగాణవాదుల అభిప్రాయాల మేరకే తెలుగు తల్లి విగ్రహాన్ని రూపొందించి ఆవిష్కరిస్తే నేటి సీఎం ఏకపక్షంగా ప్రజలకు నచ్చకున్నా కొత్త తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారని తీవ్రస్థాయిలో ఆరోపించారు.

రానున్న రోజుల్లో కాంగ్రెస్ తల్లి విగ్రహానికి కూడా ముసుగు వేయాల్సి వస్తుంది

తెలంగాణ తల్లి విగ్రహం కాదది.. కాంగ్రెస్ తల్లిది..!

జిల్లెలగూడలో మాజీ మంత్రి సబితారెడ్డి ఆడబిడ్డలను అవమానించేలా చేసిన సీఎం రేవంత్ తెలంగాణ దార్శనికుడు కేసీఆర్

జిల్లెలగూడ చందన చెరువు కట్టపై తెలుగు తల్లి విగ్రహానికి క్షీరాభిషేకంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు

బడంగ్‌పేట, డిసెంబర్ 9 : సీఎంత్ రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయకుండా కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి ఆమె క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కాంగ్రెస్ తల్లి విగ్రహానికి కూడా ముసుగు వేయాల్సి వస్తుందన్నారు. ఆడబిడ్డలను అవమానించేలా చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ అని పేర్కొన్నారు. తెలుగు తల్లి రూపాన్ని ఎందుకు మార్చారో ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నారు. కేసీఆర్ నమూనాలను చెరిపివేయడానికి రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభించుకున్న రోజు ఆడపడుచులైన ఆశావర్కర్లపై దాడి చేశారన్నారు. తెలంగాణ చరిత్రను తుడిచిపెట్టాలని చూస్తున్నారన్నారు. కేసీఆర్ అనవాళ్లు లేకుండా ఎవరూ ఏమీ చేయలేరన్నారు. తెలంగాణకు దార్శనికుడు కేసీఆర్ అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, మాజీ ఎంపీపీ లావణ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సునీత, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

నవాబుపేట పోలీసు స్టేషన్ ఎదుట ఎస్ఐ అరుణ్ కుమార్‌తో ఆశ వర్కర్లు

అరెస్ట్‌లతో 'ఆశ'యాలను ఆపలేరు

నవాబుపేట, డిసెంబర్ 10 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళుతున్న తమను ముందస్తు అరెస్ట్ చేయడం చాలా బాధాకరంగా ఉందని ఆశ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఆశ వర్కర్లను నవాబుపేట పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం పోలీసుల ద్వారా పరిపాలన సాగించడం మానుకొని ప్రజారంజక పాలన చేస్తే బాగుంటుందని ముక్త కంఠంతో నినదించారు. ఇంటి పని చేసే సమయంలో ఇలా తీసుకురావడం భావ్యం కాదన్నారు. తాము ఏమైనా రాజకీయ నాయకులమా అరెస్ట్ చేయడానికి అని మండిపడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచడం భావ్యమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రూ.18వేలు వేతనం ఇస్తామని మాట ఇచ్చినందుకే అడుగుతున్నామన్నారు. తమతో బండచాకిరి చేయించుకుంటూ మా యోగ క్షేమాల కోసం మాట్లాడితే అరెస్ట్‌లు చేయడం తెలంగాణలో కొత్త సంస్కృతికి తెరదీస్తున్నారని వారు ఆవేదన చెందారు. నిన్న కూడా అలాగే ప్రవర్తించారన్నారు. ఈ ఉద్యమం ఇంతటితో ఆపకుండా ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు పోరాడుతూనే ఉంటామని తెలిపారు. ఈ నిరసనలో బీఆర్‌టీయూ అనుబంధ నాయకురాలు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు అనిత, సభ్యులున్నారు.

ఇంటి వద్ద సేవలకు స్వస్తి

విలీనంతో తప్పని ఆన్‌లైన్ తిప్పలు

- ఇన్నాళ్లు గ్రామ సచివాలయంలోనే పరిష్కారం
- ఇకపై మున్సిపల్ కార్యాలయాలకు పరుగులు
- కాగితాల దరఖాస్తుల్లేవ్.. అంతా ఆన్‌లైన్‌లోనే
- సర్వీసు చార్జీలతో జేబులు గుల్ల.. సేవలు సున్నా
- ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల చుట్టూ తప్పని ప్రదక్షిణలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో సరికొత్త సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది. పల్లెలను స్వయంప్రతిపత్తి దిశగా నడిపించేలా బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. గ్రేటర్ చుట్టూ ఉన్న 51 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో పాలనాపరమైన ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. గ్రామాల్లో తెల్ల కాగితం మీద దరఖాస్తు ఇస్తే సమస్య పరిష్కరించుకునే అవకాశం పోనున్నది. ఏదైనా ప్రభుత్వ శాఖలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఆన్‌లైన్ సెంటర్లను ఆశ్రయించాల్సిందే. గ్రామాల్లోనూ ఈ గవర్నెన్స్ సేవలు ప్రారంభమైనప్పటికీ.. ఇంటర్‌నెట్ ఆధారిత మౌలిక వసతుల లోపం కారణంగా ఆఫ్‌లైన్ ద్వారా కూడా సేవలు పొందే వెసులుబాటు ఉంది. కానీ మున్సిపాలిటీల్లోకి మారిన తర్వాత ఏ పని కోసమైనా ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి. గ్రామాల నుంచి మున్సిపాలిటీలో చేరగానే గుడ్డెద్దు చేనులో పడినట్టుగా పాలనా వ్యవహారాలు మారిపోనున్నాయి. బలవంతంగానే జరుగుతున్న విలీన ప్రక్రియతో ఇంకెక్కడి ప్రజాపాలన అనే విమర్శలు వస్తున్నాయి.

బలహీనంగా ఈ గవర్నెన్స్..

గ్రామాలకు ఇంటర్నెట్ ఫలాలను అందించాలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-గవర్నెన్స్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగానే టీ ఫైబర్ పాలసీని రూపొందించి మిషన్ భగీరథ తరహాలో ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా కృషి చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా అడుగులు వేయలేదు. గ్రామ్ స్వరాజ్ పేరిట గ్రామాల్లో అందే సత్వర సేవలకు మున్సిపాలిటీల్లో కలపడంతో వీల్లేకుండా పోనుంది. గ్రామాల విలీనంతో ఈ వ్యవస్థ నిర్వీర్యం కానుండగా.. మున్సిపాలిటీల్లో అందించే సేవల కోసమైన ఆన్‌లైన్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల వెంబడి తిరగాల్సిన దుస్థితి రానున్నది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

పింఛన్ కోసం సర్పంచుకో, గ్రామ సెక్రటరీకో దరఖాస్తు చేస్తే మరుసటి నెల నుంచి పింఛన్ పైసలు ఇంటికే వచ్చేది. విలీన గ్రామాల ప్రజలకు ఆ సౌకర్యం లేదు. కనీసం గల్లీలో మోరీ పారుతుందని చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. అధికార వికేంద్రీకరణతోనే స్థానికంగా సేవలు అందించాల్సింది పోయి... గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. ప్రభుత్వం నుంచి ఏదైనా సేవలు పొందాలంటే గతంలో గ్రామ సచివాలయానికి వెళితే సరిపోయేది. ఇకపై ఆయా గ్రామాల ప్రజలు దూరంలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కార్యాలయాలకు వెళ్లాల్సిన దుస్థితి రానుంది. మున్సిపాలిటీల్లో చేరిన తర్వాత ప్రతిదీ ఆన్‌లైన్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలను ఆశ్రయించి, దరఖాస్తుల పేరిట జేబులు ఖాళీ చేసుకుంటే గానీ సాధ్యం కాదు.

విలీనం ఒప్పుకోం

వికారాబాద్ అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమస్యల పరిష్కారమెప్పుడు..?

టీఎస్ ఎస్‌యూఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్

వికారాబాద్, డిసెంబర్ 10 : విద్యాశాఖలో ఉన్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను 100 రోజుల్లో పూర్తి చేస్తామని ఇచ్చిన సీఎం హామీ ఏమైందని టీఎస్ ఎస్‌యూఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ ప్రశ్నించారు. మంగళవారం సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం నుంచి అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలిపారు. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ తీసి నిరవధిక సమ్మెకు దిగారు. ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి సంవత్సరమవుతున్నా ఇప్పటికీ నెరవేర్చలేదని మండిపడ్డారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్న తమను వెంటనే క్రమబద్ధీకరణ చేసి తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా సమగ్ర శిక్షా కేజీబీవీ ఎస్‌వోలు, పీటీఐలు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో దరఖాస్తుదారులకు చుక్కలు చూపెడుతున్న అధికారులు

హైడ్రా తెచ్చిన తంటాతో ఎక్కువ శాతం రిజెక్ట్‌లు

క్లియరెన్స్‌లో దరఖాస్తుదారుల సహనానికి పరీక్ష

ఆమడదూరంలో ఎల్ ఆర్ ఎస్!

సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) పథకం లబ్ధిదారుల సహనానికి పరీక్ష పెడుతున్నది. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణతో ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని ఆరాటపడేవారికి జీహెచ్ఎంసీ అధికారులు ముప్పుతిప్పలు పెడుతూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. హైడ్రా కూల్చివేతల తంటాతో అధికారులు తీవ్ర ఒత్తిడికి లోనవుతూ కొందరు, మరికొందరు భవిష్యత్తులో మరెన్ని ఇబ్బందులు వస్తాయోనని చిన్న, చిన్న కారణాలతోనూ అప్లికేషన్స్‌ను రిజెక్ట్ చేస్తున్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలాల సమీపంలో ఉన్నట్టు తెలిస్తే చాలు దరఖాస్తులను ఆమడదూరం పెడుతున్నారు. ఎఫ్‌టీఎల్ ఖరారు కాని చెరువులు, కుంటల పరిధిలోని అన్ని సర్వే నంబర్ల దరఖాస్తులను వెనక్కి పంపించేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్ పేరుతో దరఖాస్తుదారులను ఆందోళనకు గురి చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలాలపై నీటి పారుదల శాఖ అధికారులు ఎన్వోసీ ఇస్తేనే ముందడుగు వేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ఖజానా నింపుకోవాలని భావించగా, హైడ్రా కూల్చివేతలు ఆ ఆశలపై గండికొట్టినట్లయింది.

క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా ఎల్ఆర్ఎస్-2020 కింద వచ్చిన దరఖాస్తులతో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ చేపట్టారు. జీహెచ్ఎంసీ పరిధిలో 1,06,891, హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 60వేలకు పైగా దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. ఈ దరఖాస్తులను క్లస్టర్ల వారీగా విభజన చేసి, ఆ తర్వాత క్షేత్ర స్థాయి పరిశీలన చేపడుతున్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన సులభంగా చేపట్టేందుకు వీలుగా గ్రామం, వార్డు, సర్వే నంబరు, కాలనీల వారీగా క్లస్టర్లుగా విభజించే ప్రక్రియను చేపట్టారు. జోనల్ వారీగా దరఖాస్తుల పరిశీలన జరుగుతున్నది. సదరు ప్లాటు ప్రభుత్వ భూమిలో ఉందా? ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా? వంటి అంశాలను పరిశీలించి... దరఖాస్తు క్రమబద్ధీకరించేందుకు అర్హత ఉందా? లేదా? అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎక్కువ శాతం ప్రొసీడింగ్స్ వరకు వెళ్లడం లేదని, చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

జీహెచ్ఎంసీలో జోన్ల వారీగా..

జోన్	దరఖాస్తులు	పరిష్కార దశలో
ఎల్బీనగర్	39,234	4,333
చార్మినార్	15,283	7,536
ఖైరతాబాద్	5,725	1,264
సికింద్రాబాద్	5,694	3,720
శేరిలింగంపల్లి	18,622	5,377
కూకట్‌పల్లి	22,362	11,230
	1,06,920	33,460